క్లుప్తంగా

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన



నెల్లూరు(బృందావనం): మాగుంట లేఅవుట్లోని పిచ్చిరెడ్డి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన స్టయిల్స్ అండ్ వీవ్స్ వస్త్ర ప్రదర్శన ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వాహకురాలు మంజులత మాట్లాడారు. వివాహ, పండగలు, ప్రత్యేక సందర్భాల్లో ధరించేందుకు అనుగుణంగా ప్రత్యేక కలెక్షన్స్ మగువల మనస్సును దోచేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఉప్పాడ, కలంకారీ, మంగళగిరి ప్రింట్, సిల్క్ చీరలు, కాటన్, కశ్మీర్ సిల్క్ బ్లౌజులు, తదితరాలను ప్రదర్శనలో ఉంచామని వివరించారు. ఆదివారం ఉదయం పది నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ప్రదర్శన ఉంటుందని చెప్పారు.

ఘనంగా ఉగాది పురస్కారాల ప్రదానం




నెల్లూరు(బృందావనం): విశేష సేవలందిస్తున్న 30 మందికి ఉగాది పురస్కారాలను సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు రాధాకృష్ణ ఆధ్వర్యంలో శనివారం అందజేశారు. అనంతరం వారిని సత్కరించారు. పురమందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో రామరాజు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రామరాజు, వైద్యులు లలితాషిర్డీషా, లావణ్యరెడ్డి. సంఘసేవకురాలు కవితారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి



కొడవలూరు: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి పీ సత్యవాణి సూచించారు. కొడవలూరులోని జగనన్న కాలనీ లేఅవుట్ను శనివారం ఆమె పరిశీలించారు. గృహ నిర్మాణాల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గృహ లబ్ధిదారులతో మాట్లాడారు. గృహ నిర్మాణాలకు సంబంధించిన బిల్లులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నా పనుల్లో జాప్యంపై ఆరాతీశారు. ఉగాది నాటికే నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉన్నా, ఇంకా నిర్మాణాలను పూర్తి చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. చిన్నపాటి పనులు మిగిలి ఉన్న గృహాలను వారంలో పూర్తి చేసుకోవాలని సూచించారు. తొలుత మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గృహ నిర్మాణాలపై ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ప్రతిరోజూ గృహ నిర్మాణాలకు సంబంధించి ఒక్క బిల్లు అయినా పెట్టాలన్నారు. మూడ్రోజులపాటు ఎలాంటి బిల్లులు పెట్టని వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. హౌసింగ్ ఏఈ పీ సురేష్కుమార్, వర్క్ఇన్స్పెక్టర్ జానీ, డేటా ఎంట్రీ ఆపరేటర్ సునీత పాల్గొన్నారు.

రాయితీపై ట్రాక్టర్ పరికరాల పంపిణీ



కొడవలూరు: మండలంలోని తలమంచి, కొడవలూరు ఆర్బీకేల పరిధిలోని కమ్యూనిటి హైరింగ్ సెంటర్లకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద రాయితీపై ట్రాక్టర్ పరికరాలను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ లక్ష్మి మాట్లాడుతూ ఆర్బీకేల పరిధిలోని సీహెచ్సీ గ్రూపులకు వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను అందజేస్తోందని తెలిపారు. మండలంలో 16 ఆర్బీకేలు ఉండగా, 11 ఆర్బీకేల పరిధిలోని సీహెచ్సీలు యాంత్రీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకున్నాయని తెలిపారు. వ్యవసాయ పరికరాలకు 40 శాతం ప్రభుత్వం రాయితీ ఇస్తుండగా, 50 శాతం సహకార బ్యాంక్ రుణం ఇస్తుందన్నారు. సీహెచ్సీ వాటాగా కేవలం 10 శాతం నగదు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. సహకార బ్యాంక్ కోవూరు శాఖ మేనేజర్ సుధాకర్, ఫీల్డ్ఆఫీసర్ రాఘవ, వీఏఏలు ప్రసాద్, కవిత, సీహెచ్సీల సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- ఎస్పీ విజయారావు
- ముగిసిన జిల్లా స్థాయి జర్నలిస్టుల క్రికెట్ పోటీలు



రన్నర్స్గా నిలిచిన జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న విజయారావు

నెల్లూరు(స్టోన్హౌస్పేట): క్రీడలతో మానసికోల్లాసంతో పాటు ఆరోగ్యం చేకూరుతుందని ఎస్పీ విజయారావు పేర్కొన్నారు. ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్లో జేశాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన జర్నలిస్టుల జిల్లా స్థాయి క్రికెట్ పోటీల బహుమతి ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథిగా శనివారం హాజరైన ఆయన మాట్లాడారు. జర్నలిస్టులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. అనంతరం నుడా చైర్మన్, జేశాప్ గౌరవాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడారు. జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను రెండోసారి నిర్వహించడాన్ని అభినందించారు. ఈసారి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలను నిర్వహించాలని కాంక్షించారు.

ఉత్సాహంగా బహుమతుల ప్రదానం

ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో 12 జట్ల మధ్య జరిగిన టోర్నీలో నెల్లూరు సిటీ జట్టు విజేతగా, కోవూరు నియోజకవర్గ జట్టు రన్నర్స్గా నిలిచింది. బెస్ట్ బ్యాట్స్మెన్గా సర్వేపల్లి జట్టుకు చెందిన దాసు, మ్యాన్ ఆఫ్ ది సిరీస్గా నందకిషోర్ నిలిచి బహుమతులను అందుకున్నారు. అంపైర్లుగా మోహన్, విష్ణువర్ధన్కుమార్, వ్యాఖ్యాతగా శేఖర్నాయుడు వ్యవహరించారు. ఎమ్మెస్సార్ సేవా సమితి ప్రతినిధి శరత్చంద్రారెడ్డి, అడ్వొకేట్ కోటారెడ్డి, చెస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సుమన్, డీఎస్ఏ, సెట్నెల్ సీఈఓ పుల్లయ్య, డీఎస్ఏ చీఫ్ కోచ్ యతిరాజ్, సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి వీరవెంకటేశ్వర్లు, జేశాప్ జిల్లా అధ్యక్షుడు నందకిషోర్, కార్యదర్శి సునీల్కుమార్రెడ్డి, జాయింట్ సెక్రటరీ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళన



నెల్లూరు (అర్బన్): నగరంలోని జీజీహెచ్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు రోగులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ధర్నాను శనివారం చేపట్టారు. అనంతరం సూపరింటెండెంట్ సిద్ధానాయక్కు వినతిపత్రాన్ని పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వర్లు, తదితరులు అందజేశారు. పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడు కిన్నెరకుమార్, ప్రసాద్, సంపత్కుమార్, శ్రీనివాసులు, సుధాకర్, కాలేషా, రమణయ్య, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేటలో దంత వైద్య శిబిరం



నెల్లూరు (అర్బన్): నవాబుపేటలోని మహాలక్ష్మమ్మ ఆలయం వద్ద ఉచిత దంత వైద్య శిబిరాన్ని విశ్వమాత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షురాలు కల్యాణి మాట్లాడారు. తన కుమారుడు సూర్య హరికృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రెయిన్బో దంత వైద్యశాల అధినేత పల్లవి, శిల్ప, సుజిత తదితరులు రోగులను పరీక్షించి మందులను అందజేశారు. అనంతరం పల్లవి, మురళీమోహన్రావును సత్కరించారు.

క్రైమ్ కార్నర్

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): మద్యం తాగొద్దన్నారనే కారణంతో మనస్తాపానికి గురై పురుగుల మందు సేవించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. ఏసీనగర్కు చెందిన వెంకటశేషయ్య (45) ఎలక్ట్రీషియన్ పనులు చేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నారు. కొంతకాలంగా మద్యానికి బానిసైన ఆయన సంపాదించిన మొత్తాన్నంత దానికే తగలేయసాగారు. తాగుడును మానాలని పలుమార్లు భార్య కోరినా, ఆయన పెడచెవిన పెట్టారు. ఈ క్రమంలో మద్యం తాగేందుకు నగదు కావాలని భార్యను ఈ నెల 22న కోరగా, ఆమె ఇవ్వలేదు. దీంతో ఇంటి నుంచి బయటకెళ్లి పురుగుల మందు తాగి వచ్చారు. అపస్మారక స్థితిలో ఉన్న ఆయన్ను నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో భార్య చేర్పించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ మేరకు బాలాజీనగర్ పోలీసులకు భార్య అన్నమ్మ ఫిర్యాదు చేశారు. ఎస్సై సుమన్ ఆస్పత్రికి చేరుకొని పోస్ట్మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొనడంతో వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో ఆటో డ్రైవర్ మృతి చెందారు. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.. రంగనాయకులపేట గోపురంవీధికి చెందిన ఆటోడ్రైవర్ వెంకటేశ్వర్లు (66)కు భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఇంటి నుంచి బయటకొచ్చిన ఆయన రంగనాయకులపేట రైల్వే గేట్ సమీపంలో పట్టాలు దాటుతుండగా, గువాహటి ఎక్స్ప్రెస్ వేగంగా ఢీకొంది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న రైల్వే హెడ్కానిస్టేబుల్ ప్రభాకర్ ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్ట్మార్టం నిమిత్తం మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కాగా రైల్వే లోకో పైలట్ హారన్ కొట్టినా, వినికిడి లోపంతో వెంకటేశ్వర్లుకు వినిపించలేదని స్థానికులు తెలిపారు. హెడ్కానిస్టేబుల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం పేరిట మోసం

నెల్లూరు(క్రైమ్): బ్యాంక్లో ఉద్యోగాన్ని ఇప్పిస్తానని నగదును తీసుకొని మోసగించిన నిందితుడిపై చిన్నబజార్ పోలీసులు కేసును శనివారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. రేబాలకు చెందిన కార్తీక్ ఆర్టీసీలో ఏడీసీగా పనిచేస్తున్నారు. గతంలో ఒకటో డిపోలో కండక్టర్గా పనిచేశారు. ఆ సమయంలో నెల్లూరు – మోడేగుంట సర్వీస్లో విధులు నిర్వర్తిస్తుండగా, వేగూరుకు చెందిన నాగేశ్వరరావుతో పరిచయం ఏర్పడింది. కార్తీక్ కుటుంబ వివరాలను నాగేశ్వరరావు సేకరించారు. తనకు ఎస్బీఐలో ఉన్నతాధికారులు తెలుసునని.. తిరుపతి లేదా చేజర్ల శాఖలో నీ కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని కార్తీక్ను నమ్మించి రూ.30 లక్షలను తీసుకున్నారు. నగదును తీసుకొని నెలలు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించలేదు. దీంతో కార్తీక్ నిలదీయగా కాలయాపన చేయసాగారు. దీంతో ఉద్యోగం పేరిట మోసగించిన నాగేశ్వరరావుపై చర్యలు చేపట్టాలని ఫిర్యాదు చేశారు. ఎస్సై లేఖాప్రియాంక కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారుతో ఉడాయింపు

నెల్లూరు(క్రైమ్): ఆభరణాల తయారీకి ఇచ్చిన రూ.లక్షల విలువజేసే బంగారుతో తయారీదారుడు ఉడాయించిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. వివరాలు.. ఆచారివీధికి చెందిన సురేష్కుమార్ జైన్ గిడ్డంగి వీధిలో గోల్డెన్ జ్యువెల్స్ పేరిట బంగారు ఆభరణాల విక్రయ దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. కొరడావీధిలోని ఇమ్రాన్బాషాకు బంగారాన్ని ఇచ్చి ఆభరణాలను తయారు చేయించేవారు. ఈ నేపథ్యంలో ఆభరణాల తయారీ కోసం ఇమ్రాన్కు 600 గ్రాముల బంగారాన్ని గత నెల 15న ఇచ్చారు. రోజులు గడుస్తున్నా ఆభరణాలను ఇమ్రాన్ ఇవ్వలేదు. దీంతో సురేష్కుమార్జైన్ ప్రశ్నించగా, ఆరోగ్యం సక్రమంగా లేదంటూ కాలయాపన చేస్తూ వచ్చారు. పది రోజుల క్రితం బంగారుతో ఇమ్రాన్ ఉడాయించారు. అతని షాపు, ఇంటికి తాళం వేసి ఉండటం, ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సంతపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్స్పెక్టర్ కల్యాణ్రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సెల్ఫోన్ దొంగకు దేహశుద్ధి

నెల్లూరు(క్రైమ్): సెల్ఫోన్ను చోరీ చేసిన యువకుడికి బాధితులు దేహశుద్ధి చేశారు. వివరాలు.. నవాబుపేటకు చెందిన ప్రశాంత్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఓ హాస్పిటల్ మెడికల్ షాపులో పని చేస్తున్నారు.

హాస్పిటల్లోని ఎక్స్రే రూమ్లో తన ఫోన్ను ఈ నెల 22న ఉంచిన ఆయన పని నిమిత్తం బయటకెళ్లాడు. ఈ క్రమంలో సెల్ఫోన్ను ఓ యువకుడు అపహరించుకెళ్లారు. పని అనంతరం హాస్పిటల్కు వచ్చిన ప్రశాంత్కు ఫోన్ కనిపించకపోవడంతో సీసీ కెమెరాలను పరిశీలించారు. సెల్ఫోన్ అపహరణ దృశ్యాలు కనిపించడంతో నిందితుడి కోసం చుట్టుపక్కల గాలించారు. సెల్ఫోన్ను అపహరించిన యువకుడు హాస్పిటల్ వద్దకు శనివారం రావడాన్ని గమనించిన ప్రశాంత్ తన సహచరులతో కలిసి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారని తెలిసింది.

ఎమ్మెల్సీ సునీతకు సత్కారం



నెల్లూరు రూరల్: ఎమ్మెల్సీగా ఎన్నికైన పోతుల సునీతను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగ జిల్లా అధ్యక్షురాలు గౌరి సత్కరించారు. తాడేపల్లిలో శనివారం నిర్వహించిన పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర స్థాయి సమావేశంలో సన్మానించారు.

కాంగ్రెస్ నేతల నిరసన




నెల్లూరు(వీఆర్సీసెంటర్): కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడాన్ని ఖండిస్తూ నిరసన కార్యక్రమాన్ని పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవకుమార్రెడ్డి ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నేతలు ఫయాజ్, మోహన్రెడ్డి, లతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వెంకటశేషాచార్యులుకు గౌరవ డాక్టరేట్

నెల్లూరు(బృందావనం): జిల్లా అర్చక సమాఖ్య ప్రధాన కార్యదర్శి వెంకటశేషాచార్యులు గౌరవ డాక్టరేట్ను అందుకున్నారు. తమిళనాడులోని హోసూరులో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వేదిక్ ఆస్ట్రాలజీ అండ్ హ్యూమానిటీపై తనకు గౌరవ డాక్టరేట్ను ఆసియా వేదిక్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు అందజేశారని ఆయన చెప్పారు.

రాకెట్ ప్రయోగ విజయవంతాన్ని కాంక్షిస్తూ..



నెల్లూరు(బృందావనం): శ్రీహరికోట నుంచి చేపట్టనున్న ఎల్వీఎం – 3 రాకెట్ ప్రయోగ విజయవంతాన్ని కాంక్షిస్తూ భక్తవత్సలనగర్కు చెందిన కార్పెంటర్ శ్రీనివాసులు తన కళా నైపుణ్యంతో రాకెట్ నమూనాను శనివారం తీర్చిదిద్దారు. 140 చొక్కా గుండీలను వినియోగించి ఎనిమిది అంగుళాల పొడవు, నాలుగంగుళాల వెడల్పుతో రాకెట్ నమూనాకు రూపమిచ్చారు.

రాహుల్ గాంధీ వ్యాఖ్యలు తగవు

నెల్లూరు(వేదాయపాళెం): కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తన ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీని కులం పేరుతో దూషిస్తూ మోదీలందరూ దొంగలంటూ మాట్లాడటం తగదని అఖిల గాండ్ల, తెలికుల సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకరి తప్పును కులానికి ఆపాదించి మాట్లాడటం తగదని చెప్పారు.

వైఎస్సార్సీపీకి ఎలాంటి నష్టం లేదు

- మంత్రి కాకాణి గోవర్ధన్రెడ్డి



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్రెడ్డి

నెల్లూరు(పొగతోట): ఒకరిద్దరు ఎమ్మెల్యేలు వెళ్లినంత మాత్రాన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వచ్చిన నష్టమేమీలేదని, పార్టీకి కార్యకర్తలు, ప్రజలు అండగా ఉన్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని జెడ్పీ కార్యాలయంలో విలేకరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి శనివారం సమాధానమిచ్చారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన ఎమ్మెల్యేలను అధిష్టానం సస్పెండ్ చేసిందన్నారు. కొందరు ఎమ్మెల్యేల పనితీరు సక్రమంగా లేకపోవడంతో వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం కుదరదని సీఎం జగన్మోహన్రెడ్డి తేల్చిచెప్పడంతో అలాంటి వారు పార్టీని వీడుతున్నారని చెప్పారు. వెళ్లే వారు పార్టీపై బురదజల్లుతున్నారని, ఇది సరైన పద్ధతి కాదని హితవు పలికారు. గత ఎన్నికల నాటి తీర్పునే రానున్న ఎన్నికల్లోనూ ప్రజలు ఇవ్వనున్నారని చెప్పారు.

వేడుకగా కొౌతాయి మహోత్సవాలు



నెల్లూరు(బృందావనం): పప్పులవీధిలోని ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో రాములవారి వార్షిక కౌతాయి మహోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీనివాస అలంకారంలో దర్శనమిచ్చారు. ప్రసన్నాంజనేయస్వామి ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఉభయకర్తలుగా వెంకయ్య కుటుంబసభ్యులు వ్యవహరించారు. ఆలయ కమిటీ సభ్యులు సుబ్బారావు, రామచంద్రరావు, బాలాజీ, ఈఓ హేమచంద్రరావు పర్యవేక్షించారు.

రూల్స్ను సవరించాలని వినతి



నెల్లూరు (టౌన్): మున్సిపల్ ఎడ్యుకేషనల్ సర్వీస్ యూనిఫైడ్ డ్రాఫ్ట్ రూల్స్ను సవరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రాజమనోహర్, ఏడుకొండలు కోరారు. నగరంలోని ఎస్టీయూ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో శనివారం వారు మాట్లాడారు. మున్సిపల్ టీచర్ల ఉమ్మడి రూల్స్కు సంబంధించి జిల్లాలోని కార్పొరేషన్ను ఒక యూనిట్గా, మిగిలిన మున్సిపాల్టీలను ఒక యూనిట్గా పరిగణించాలని కోరారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు.

కేన్సర్ హాస్పిటల్కు రూ.ఐదు లక్షల విరాళం



కలెక్టర్కు చెక్కును అందజేస్తున్న రంగయ్యనాయుడు

నెల్లూరు (అర్బన్): పొదలకూరు రోడ్డులోని ఇండియన్ రెడ్క్రాస్ కేన్సర్ హాస్పిటల్లో నూతన భవన నిర్మాణానికి రూ.ఐదు లక్షల విరాళాన్ని రైస్మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రంగయ్యనాయుడు అందజేశారు. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో కలెక్టర్ చక్రధర్బాబుకు ఆయన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఇచ్చారు. రెడ్క్రాస్ కేన్సర్ హాస్పిటల్ నూతన భవనంలో ఓ గదికి తన తల్లిదండ్రులు రామచంద్రయ్యనాయుడు, రమణమ్మ జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని అందజేశానని చెప్పారు. కేన్సర్ హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, సామాజిక కార్యకర్త సురేష్కుమార్రెడ్డి పాల్గొన్నారు.

ఆర్మీ ఉద్యోగుల పిల్లలకు 'విశ్వసాయి'లో ఉచిత విద్య

నెల్లూరు (టౌన్): ఆర్మీ ఉద్యోగుల పిల్లలకు 2023 – 24 విద్యా సంవత్సరం నుంచి ఉచిత విద్యను అందించనున్నామని విశ్వసాయి విద్యాసంస్థల చైర్మన్ సత్యనారాయణ, వైస్ చైర్మన్ కృష్ణమోహన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలతో పాటు పోటీ పరీక్షలకు సైతం పూర్తి ఫీజు రాయితీని ఇవ్వనున్నామని వివరించారు. సైన్యంలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వారి పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీని ఇవ్వనున్నామని, వివరాలకు కళాశాల కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

అర్హులకు సంక్షేమ పథకాలను అందించాలి



రికార్డులను పరిశీలిస్తున్న శైలేంద్రకుమార్

నెల్లూరు రూరల్: సచివాలయాల ద్వారా అర్హులకు సంక్షేమ పథకాలను సజావుగా అందించే అంశంలో సిబ్బంది, వలంటీర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని నెల్లూరు రూరల్ ఇన్చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్ పేర్కొన్నారు. దేవరపాళెంలోని సచివాలయాన్ని శనివారం సందర్శించారు. రికార్డులను పరిశీలించిన అనంతరం సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో సైతం ఇబ్బందుల్లేకుండా పథకాలను అందించాలని సూచించారు.

జాతీయ స్థాయి స్కాలర్షిప్లకు ఇద్దరి ఎంపిక



పూజిత



లిఖిత


నెల్లూరు రూరల్: జాతీయ స్థాయి స్కాలర్షిప్కు ధనలక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థినులు ఎంపికయ్యారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రతిభ పరీక్షల్లో పూజిత 144 మార్కులతో జిల్లా స్థాయిలో ఆరో ర్యాంక్ను సాధించారు. అదే విధంగా 94 మార్కులతో స్కాలర్షిప్కు లిఖిత అర్హత పొందారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు గిరిధర్ సింగ్ మాట్లాడారు. ఎంపికైన విద్యార్థులకు ఇంటర్మీడియట్ వరకు ఏడాదికి రూ.12 వేల చొప్పున అందించనున్నారని పేర్కొన్నారు.

రెడ్క్రాస్ ఎన్నికలకు నామినేషన్లు నేడు

- ఏప్రిల్ 2న ఓటింగ్

నెల్లూరు (అర్బన్): రెడ్క్రాస్ జిల్లా కమిటీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియను జిల్లా సహకార శాఖ అధికారి తిరుపాల్రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించనున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో రెడ్క్రాస్ సర్వసభ్య సమావేశాన్ని జరపనున్నారు. నామినేషన్లను మధ్యాహ్నం 12 నుంచి స్వీకరించనున్నారు. అనంతరం ఉపసంహరణ ప్రక్రియను పూర్తి చేసి అభ్యర్థుల వివరాలను ప్రకటించనున్నారు. ఏప్రిల్ రెండున ఓటింగ్, మూడున కౌంటింగ్, నాలుగున రెడ్క్రాస్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, కోశాధికారిని ఎన్నుకోనున్నారు. గతంలో పోటీ చేసిన ఏవీఎస్ ప్యానెల్, మరో ప్యానెల్ ఈసారి పోటీకి దూరంగా ఉండనున్నాయి. 7704 మంది రెడ్క్రాస్ సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. నెల్లూరుతో పాటు కావలిలో ఓటింగ్ను నిర్వహించనున్నారు. కాగా ఎన్నికల ఏకగ్రీవానికి గతంలో పోటీ చేసిన నేతలతో పాటు తాజా మాజీ పాలకమండలి సభ్యులు చర్చలు జరుపుతున్నారు. ఈసారి సైతం రెడ్క్రాస్ చైర్మన్గా చంద్రశేఖర్రెడ్డే కొనసాగాలని పలువురు కోరారు.

తెగిన విద్యుత్ తీగలు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని 53వ డివిజన్లో గల సెంట్రల్ వేర్హౌస్ కార్పొరేషన్ గోదాముల సమీపంలో 11 కేవీ విద్యుత్ వైరు తెగి రోడ్డుపై శనివారం పడిపోయింది. సమాచారం అందుకున్న సిబ్బంది వెంటనే సరఫరాను నిలిపేశారు. సకాలంలో స్పందించడంతో ప్రమాదం తప్పింది. అనంతరం మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు.